# పల్లెల్లో దొంగతనాలేకాదు -దారిదోపిళ్లుకూడా!

**పొదలకూరు దారిదోపిడీ!**

దొంగతనాల సంగతి అటుంచండి, దారిదోపిడీలుకూడా పెరిగిపోతున్నాయి జిల్లాలో. 4 తేది రాపూరు తాలూకా పాలిచర్లపాడు సమీపాన ఐదుగురు ఆడవాళ్లు, ఇద్దరు మగవాళ్లను కొందరు దుండగులు అటకాయించి 25 సవర్ల బంగారు నగలు, రు 2500లు దోచుకపోయారు.

దారిదోపిడీకి గురైనవారందరూ పాలిచర్లపాడుకు చెందినవారట. ఆ రోజున నెల్లూరులో ఒక పెళ్ళికివచ్చి, తిరిగి ఊరికి వెళ్తున్నారట. నెల్లూరు-పొదలకూరు రోడ్డులో 11వ మైలువద్దదిగి, పాలిచర్లపాడుకు కాలినడకన పోతున్నారట. ఇంతలో ఐదుమంది వార్ని అడ్డగించి, కత్తి చూపి బెదిరించి, ఆడవాళ్ళ ఒంటిమీద నగలన్నీ మొత్తంగా ఒలుచుకొని, మగవాళ్ళవద్ద వుండిన రు 2500లు పెరుక్కొని ఉడాయించేశారట. ఆ బాధితులలో ఒక 15 ఏళ్ళ పిల్లవాడుకూడా వున్నాడట!

ఈదగాలిలో 1 తేది రాత్రి ఆలూరు రమణారెడ్డి ఇంట్లో దొంగలు దూరి, ఆడవాళ్ళ మెడలో నగలు దొంగిలించుక పోయారట. తర్వాత మరికొందరి ఇళ్లలో కూడా జొరబడ్డారట గానీ, ఏమీపోలేదట. ఆ ఊళ్ళో ఇటీవల ప్రతిరాత్రి ఇళ్ళమీద రాళ్ళు పడుతున్నాయట గ్రామస్థులు భయంతో బిక్కుబిక్కు మంటున్నారని ఒకరు వ్రాస్తున్నారు.

## జిల్లావార్తలు

జిల్లాలో దొంగతనాలెక్కువ జాస్తిగా ఉంది. క్రొత్త ఎస్ పి శ్రద్ధవహించి పోలీసు యంత్రాంగ పటిష్టపరచి, ప్రజలకు భద్రత కల్గించాలి. అవసరమైతే ఇందుకు స్పెషల్ పోలీసునైనా నియమించాలి.

**ఆత్మకూరులోకూడా చోరాయణం!**

దొంగతనాలు నెల్లూరు, గూడూరు తాలూకాల్లోనే జాస్తిగా జరుగుతున్నాయను కున్నాము. కానీ జిల్లాఅంతా వ్యాపిస్తున్నట్లున్నాయి ఆత్మకూరులో 2 తేది రాత్రి చల్లా రామరెడ్డిఅనే రైతుయింట్లో దొంగలు జొరబడి, 35 సవర్ల బంగారం, కొంత డబ్బు చేజిక్కించుకొనిపోయారట పోలీసు దర్యాప్తు చేస్తున్నారట గానీ, ఎందుకోగాని వాళ్ళలో అంత ఉత్సాహం కనబడ్డంలేదు.

**అల్లూరు లయన్స్ నేత్రశిబిరం**

అల్లూరు లయన్స్ క్లబ్బియువారు 1 తేది నుంచి 7 తేది దాకా ఉచిత నేత్రశిబిరం నిర్వహించారు. మొత్తం 1500 మంది కంటిరోగులను పరీక్షించి 64 మందికి ఆపరేషన్లు చేశారు. నెల్లూరు పెద్దాస్పత్రి కంటిడాక్టర్లు శ్రీ పి సైదారావు, శ్రీ టి. వట్టాభిరామిరెడ్డి ఈ శస్త్రచికిత్సలుచేశారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి అద్దాలుకూడా ఉచితంగా ఇచ్చారు. కడపటిరోజున శ్రీ టి వెంకారెడ్డి అధ్యక్షతన సభలో ఎం. ఎల్. ఏ. శ్రీ ఎస్ శ్రీరామమూర్తి ఈ కళ్ళద్దాల పంపకం చేశారు; లయన్స్, రోటరీ సంస్థలు పల్లె ప్రాంతాలకుకూడా విస్తరిల్లడం ఆనందదాయకమన్నారు.

అల్లూరు లయన్స్క్లబ్ స్థాపించి ఐదు నెలలే అయినా, సామాజికసేవకార్యక్రమాలు ఉత్సాహంగా సాగుతున్నట్లు పి డిండి-కార్యదర్శి శ్రీ వై బలరామరెడ్డి నివేదికబట్టి తెలుస్తోంది. ఊళ్ళో నాలుగు పబ్లిక్ కొళాయిలు, ఒక బస్సు షెల్టరు వేయించారట. ఈ నేత్ర శిబిరం, హెచ్చుతక్కువ రు 8000లు ఖర్చుచేసి నిర్వహించారు.

శిబిరంలో పనిచేసిన డాక్టర్లు, నర్సులు, కాలేజి విద్యార్థులు, స్కౌట్లు శ్రీ శ్రీరామమూర్తి యోగ్యతాపత్రాలిచ్చారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న శ్రీ పల్లి వెంకట సుబ్బారెడ్డి అనే 80ఏళ్ళ వృద్ధుడు లయన్స్ వారి సహాయానికి కృతజ్ఞత తెలియజేశాడు.

లయన్స్వంటి సేవాసంస్థల అవసరం గ్రామాలకే జాస్తిగా ఉంటుంది. ప్రతి పెద్ద గ్రామంలోనూ ఇటువంటి సేవాసంఘాల శాఖలు ఏర్పడ్డం అవసరం.

**ఉదయగిరి దుస్థితి**

ఇటీవల రాలిన నాలుగు చినుకులతో జిల్లా అంతటా పరిస్థితి కొంత కుదుటపడిందనుకున్నాముకానీ, ఉదయగిరితాలూకాను మాత్రం ఇంకా క్షామదేవత కబంధహస్తాలలో వుంచుతూనేవుంది. 15 రోజులుగా విపరీతమైన ఎండలు; వాటితోడు ఈదురుగాలులు. వర్షం బొట్టు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నారుమళ్లు ఎప్పుడో ఎండిపోయాయి. వాటితో పాటే రేగడినేలల్లో వున్న అనపకాయ పైర్లు కూడా ఎండిపోతున్నాయి. అమెరికా సత్తువ చేసిన పొలాలకు ఫామ్ వేయబోయింది. కరిపిన కొద్దిపాటి నీర్వాటి అక్కడక్కడా సాగారు వెట్టుకునేవారు. ఎక్కడా ఇప్పుడు బావుల్లో చుక్కనీరు లేదు. మెట్టపైర్లుకూడా ఇకనైనా వర్షం పడకపోతే ఎండిపోయేట్లున్నాయి.

మొత్తంమీద ఉదయగిరి పరిస్థితి హృదయవిదారకంగానే వుంది.

**కొండాపురం బలహీనవర్గాల ప్రదర్శన**

కావలితాలూకా కొండాపురం ఫిర్కాలో హరిజన, గిరిజన తదితర బలహీనవర్గాలకు బంజరు భూముల పంపిణీ విషయంలో రెవిన్యూ అధికారులు పక్షపాతం చూపిస్తున్నారంటూ, కావలి మార్కిస్టు-లెనినిస్టు పార్టీ 26 తేది, ఆర్. డి. ఓ. ఆఫీసు ముందు ప్రదర్శన జరిపింది.

పెద్దరైతులు కిర్చిన పట్టాలను రద్దు చేయాలని, నకిలీ పట్టాలకు బాధ్యులైన అధికారులపై తగినచర్య తీసుకోవాలని వారు కోరారు.

గతనెల 1 తేదీనుండే ఈ పార్టీవారు తూర్పుపాలెం, తాయిపేట గ్రామాలలో బంజర్లను ఆక్రమించుకొంటున్నారట. పట్టాపొలాలు, న్యాయార్జితమా కాదా అన్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం మంచిదేకాని, బలవంతంగా ఆక్రమించుకొని శాంతిభద్రతలకు భంగం కల్గించడం మంచిదికాదు. ఈ విషయంలో రెవిన్యూ అధికారుల కార్యాచరణకూడా విచారించాలి.

**విద్యానగర్ ప్రయోజనసిద్ధి**

విద్యానగర్ ఎన్ బి కె. ఆర్. కాలేజి

-కొరవ 5 వ పేజీలో

## నివాళులు



అరమరికలు లేని నిండు మనస్సుతో అందర్ని అలరించి ఆదరించిన ఆర్ద్రహృదయుడు అహర్నిశలు మా అభివృద్ధికై పాటుపడిన మహామనిషి.

**శ్రీ కోడూరు సుబ్బరామరెడ్డి**

చిన్నచెరుకూరు

తే 6-10-78 ది స్వర్గస్తులైన సందర్భమున వారి దివ్య పవిత్రాత్మకు ఇవే మా బాష్పాంజలులు.

—బంధుమిత్రులు.



